



కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి

జే.పంగులూరు: రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో క్రిస్మస్, నూతన సంవత్సర సందర్భంగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు జరుగుతాయి. ఈ పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను శనివారం అద్దంకి నియోజక వైఎస్సార్ ఇన్‌చార్జ్ పానెం హనిమిరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి క్రీడలకు ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం అని తెలిపారు. పండగల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పోటీలు నిర్వహించడం ఎంతో మంచి సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు జంపాని రవి, సర్పంచ్ చొప్పరపు ప్రభాకర్, అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు యలమందరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపదను సద్వినియోగం చేసుకోవాలి


చేప పిల్లలు వదులుతున్న మత్స్యశాఖ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు

అద్దంకి: గుండ్లకమ్మ జలాశయంలో చేప పిల్లలను వదలడం ద్వారా అనుమతించిన పరిసర ప్రాంత జాలర్లకు ఉపాధి కలుగుతుందని మత్స్య శాఖ జేడీ పీ సురేశ్ అన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మణికేశ్వరం గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదిలో మిషన్ ఫింగర్ లింక్స్, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన ద్వారా మూడు లక్షల చేప పిల్లలను నదీ జలాల్లోకి వదిలారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జలాల్లో వదిలినచేప పిల్లలు పెరిగి పెద్దవైన తరువాత లైసెన్స్ ఉండి అనుమతించిన పరిసర ప్రాంత జాలర్లు ఆ సందపను వలలతో పట్టుకుని ఉపాధి పొందాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని చెప్పారు.కార్యక్రమంలో చీరాల ఏడీ కృష్ణ కిషోర్, ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డి, ఈదా శ్రీనివాసరెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ సోమా శ్రీనివాసరెడ్డి, ఈదా శ్రీనివాసరెడ్డి (చిన్న శ్రీనివాసరెడ్డి) మందా చిన్న నాగయ్య పాల్గొన్నారు.

గర్భిణులు సూచనలు పాటించాలి

చీరాల టౌన్: గర్భిణులు విధిగా వైద్య పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనల, సలహాలు పాటిస్తే ప్రసవాలు సాధారణంగా జరగడంతో పాటుగా తల్లీబిడ్డ ఆరోగ్యంగా జీవిస్తారని ఈపూరుపాలెం పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. శనివారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతృత్వ సురక్షా యోజనలో భాగంగా గ్రామంలోని గర్భిణులకు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేశారు.

డీసీపీసీ సభ్యులు నాగిరెడ్డికి పురస్కారం


పురస్కారం అందుకుంటున్న నాగిరెడ్డి

కారంచేడు: జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మున్నంగి నాగిరెడ్డికి పురస్కారం లభించింది. బాపట్ల కలెక్టర్ కార్యాలయ మీటింగ్ హాలులో డీఎస్ఓ ఈబీ విలియమ్స్ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఈసందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులకు సరైన అవగాహన కల్పించడంతో పాటు, వినియోగదారులకు అవసరమైన అవగాహనలు కల్పించడంలో నాగిరెడ్డి విశేష ప్రతిభను కనపబరిచారన్నారు. వినియోగదారులు ఆన్‌లైన్ మోసాలకు పాల్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందన్నారు. నాగిరెడ్డిని శాలువాతో సత్కరించి మెమెంటోను బహూకరించారు. కార్యక్రమంలో డీసీపీసీ కన్వీనర్ ఇమ్మానుయేలు, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం


ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ సరోజిని

చీరాల టౌన్: ఎన్నికల్లో ఉపయోగించే ఈవీఎంల పనితీరుపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని చీరాల రిటర్నింగ్ అధికారి ఆర్‌డీఓ పీ సరోజిని రెడ్డి సూచించారు. శనివారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఈవీఎం పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానం, ఓటరు రసీదు తదిర విషయాలపై తెలియజేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఏఈఆర్‌ఓ తహశీల్దార్ ప్రభాకర్‌రావు, ఏఈఎస్ఓ రామకృష్ణ, ఆర్‌ఐలు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు


విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న అతిథులు

మేదరమెట్ల: సైన్స్‌ఫేర్ పోటీల్లో బాపట్ల జిల్లాలో నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో మేదరమెట్ల జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. పోటీలకు మొత్తం 75 ప్రాజెక్టులు రాగా వీటిలో ఎండీఎంను కొలవడం దాని వినియోగం, గణితాన్ని సులభంగా నేర్చుకునే పద్ధతులకు సంబంధించి రెండు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సైన్స్ ఉపాధ్యాయుడు పోతురాజు శనివారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

కోర్టుకు హాజరుకాని నిందుతుడి అరెస్టు

చినగంజాం: కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తిరుగుతున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చినగంజాం ఎస్సై కే సురేష్ తెలిపారు. ఎస్సై వివరాల మేరకు.. చినగంజాం పోలీసు స్టేషన్ 2013లో నమోదు చేసిన యాక్సిడెంట్ కేసులో నిందితుడైన అయిన గుంటూరుకు చెందిన గాజుల శివ రామకృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసి న్యాయస్థానంలో చార్జ్‌షీట్ దాఖలు చేసినట్లు తెలిపారు. నిందితుడి కేసు విచారణ సమయంలో కోర్టుకు హాజరు కాకుండా నిర్లక్ష్య వైఖరితో చట్టాన్ని సైతం లెక్క చేయకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. వాయిదాలకు హాజరు కాకపోవడంతో ముద్దాయి మీద నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. ఎస్సై తన సిబ్బంది ద్వారా శివరామకృష్ణను అరెస్టు చేసి చీరాల న్యాయస్థానంలో హాజరు పరచగా వారికి 14 రోజుల రిమాండ్ ఇవ్వడంతో ఒంగోలు జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.